

# వెన్నెల్లో విహరించు

అవసరాల రామకృష్ణారావు

నేనూ మా అక్కయ్య రేవతీ పుట్టింది ఒక కడుపునే అయినా విడివిడిగా పెరిగాం. మా అక్కయ్య పెళ్ళినాటికి నాకు బాగా చిన్నతనం. అప్పట్లో మాకు బాగా ఆస్తి ఉండేదిట. ఇంట్లో మొదటి పెళ్ళి కదా అని ఒళ్ళూ పై తెలీకుండా ఖర్చు పెట్టేశాడుట నాన్న. ఆ అయిదు రోజుల పెళ్ళి ఆఖరు రోజున మాకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు అయి మా ఆస్తి అంతా అన్యాక్రాంతం అయినట్టు తెలిసిందిట! ఆ దెబ్బతో మంచం చేరిన మా నాన్న మరి లేవ లేదుట. మా పెద్దమ్మ మొగుడుకి ఎంతో కష్టంతో నన్ను దత్తత యిచ్చి మరీ కన్ను మూశాడట.

పట్నంలోని మేడింటికి మా పెద నాన్నా వాళ్ళతో మకాం మార్చేయడంతో మా మధ్య దూరం బాగా పెరిగింది. మా ఇద్దరి మధ్యా ఉన్న ఇరవై ఏళ్ళ వయసు తేడా సరేసరి. అయితే మా అక్కయ్యకీ నాకూ మధ్యనున్న అసలైన అగాధమేమిటో నా పెళ్ళినాడు గాని అవగాహన కాలేదు నాకు.

మా అక్కయ్య కూతురు అనూరాధనే నేను పెళ్ళి చేసుకున్నది.

చెప్పకేం ఆ పిల్లని చేసుకోడం మా పెద్దమ్మ కాస్త యిష్టం లేదు. 'ఆ రేవతివి అన్నీ పాత పద్ధతులు. ఇక్ష్వాకుల కాలం నాటి ఆచారాలు. ఆ ఇంటి పిల్లని తెచ్చుకుంటే మనం సరిగా సర్దుకు పోలేమేమోనని నా భయం' అని మొదట్లోనే స్పష్టీకరించింది. ఇంకా మేం ఇలా పడుగూ పేక వేస్తూ ఉండగానే ఓనాడు అక్కని తీసుకుని మా బావ మా యింటికి వచ్చేశాడు.

ఆ అమ్మాయి చక్కదనం ముందు మా అనుమానాలన్నీ చెల్లా చెదరు అయిపోయాయి. మా పెద్దమ్మ కూడ మరేం అడ్డు చెప్పలేదు.

ఇలా అనూని ఇక్కడికి తెచ్చినట్టు మా రేవతికి తెలిసిందో ఇంటికి నిప్పెట్టేస్తుంది. దానివన్నీ రూల్సు. ఆధునిక భావాల్ని అర్థం చేసుకునే తాహతు అది సంపాదించలేదు. మీకు మా అనూ నచ్చినందుకు సంతోషం. మరోసారి పెళ్ళి చూపులంటూ మా యింట్లో యధా విధిగా ఏర్పాటు చేసి మీకు తెలియజేస్తాను. అప్పుడే వచ్చి చూసుకున్నట్టు మా యింట్లో చెబుతారుగా!'

ఇవతలి గది లోంచి ఇలాంటివి వినపడుతున్నా నా చూపులు మాత్రం పక్క గదిలోని గోడ చీల్చుకుని అక్కడ నిలబడిన అనూరాధ బట్టలు చీల్చుకుని ఎక్కడెక్కడో స్పృశిస్తున్నాయ్!

పెళ్ళినాటి పేచి అంతా మగపెళ్ళి వారిదే అని చెప్పుకుంటారు. మా విషయంలో మాత్రం జరిగింది దానికి పూర్తిగా వ్యతిరేకం. ఆ రెండ్రోజులూ ఎక్కడ చూసినా మా అక్కయ్య గొంతుక ఆ పెళ్లి పందిట్లో మార్మోగి పోయేది. మా వాళ్ళు ఎక్కడికక్కడ సరిపెట్టుకుని సర్దుకు రాబట్టిగాని మరొకరైతే అక్కడి కక్కడే తెగతెంపులు చేసుకుని వచ్చేసి ఉందురు.

మాట వరసకి ఇప్పటి పెళ్ళిళ్ళలో

డ్రింక్ పార్టీ అనేది వీడియో , తియ్యడం అంత సర్వ సహజం. నలుగురూ ఆమోదించి ఆచరణలో పెడుతున్నంత కాలం దాని మంచి చెడ్డల విమర్శ అప్రస్తుతం. అయినా మా నారాయణ బావ అక్కయ్యకి జడిసి ఆవిడకి తెలీకుండా పార్టీ ఏర్పాటు చేశాడు. పెద్ద పెద్ద ఫంక్షన్సులో ఇలాటివి దాగుతాయి గనుకనా! 'ఇలాంటి దగుల్బాజీ తాగుముచ్చు సంబంధం అనుకోలేదు' అంటూ ఆవిడ ఎగరగొట్టిన దుమ్ము మా వాళ్ళ కళ్ళల్లో పడి మందు వీద ఉన్నారేవెంచిందులు తొక్కేశారు. వాళ్ల కాళ్ళావేళ్ల పడేసరికి మా నారాయణబావ నవ నాళ్ళూ క్రుంగిపోయి ఉండాలి.

ఏమైనా సొంత అక్కయ్యలో ఇంతగా విజృంభిస్తున్న స్టుపిడిటీకి తట్టుకోలేక నా మనసు విలవిల్లాడింది. పిల్లకి తల్లిగాలి సోకకుండా మా బావ అంత చిన్నతనం నుంచీ అనూని పై ఊళ్ళో హాస్టల్లో పెట్టి ఎందుకు చదివించాడో అర్థమయింది. అయితే పగలంతా నన్ను అల్లరి పెట్టిన ఆలోచనలన్నీ ఏ రాత్రికి ఆ రాత్రి పడక గది గడప దగ్గిరే ఆవిరి అయిపోయేవి.

అలా మిడిసి సడుగా ఎగిరెగిరి సాగిపోతూ ఆరంభమయిన మా సంసార జీవనం, కాస్త కుదురుగా కొన్నేళ్ళు నడిచి ఈ అయిదేళ్ల తర్వాత ఈ మధ్య అతి నెమ్మదిగా దార్లో స్టేజికి చేరుకుంది. నాలుగేళ్ల శశికాంత్ ఏడాది తారా మా ఇంట్లో ఉదయించిన మాట నిజమేగాని సొగసులు కాదని లొసుగులు ఎత్తి చూపే స్థితికి దిగజారి సొయ్యాక్, ఇక కాపురాల్లో కాంతులు ఎలా కనిపిస్తాయ్?

లోపాలు కనపడక పోవాలేగాని అణువంతటివి అంతరిక్షం సైజుకి ఎదిగిపోడం అదెంత సేపు! మాట వరసకి ఆడదాని కళ్లల్లో దుమ్ముకొడితే మగాడి తప్పేమోగాని తన మనకు తను నేరే దుమ్ముకొట్టు కుంటే అదో బ్రహ్మ హత్యా పాతకమూ ! అప్పటికి ఫామిలీ లేడీసు ఇలాంటివి ఆమోదించవని మనసు ఏలాగో ఉగ్గబట్టుకుని, పెళ్ళికి ముందే నా బెయిన్ కి పెయిన్ బామ్ వంటి ఆ చెయిన్ స్మోకింగుని ఎలగో అపు చేసుకున్నాను. నా ఫాంటుకి లోపలి వైపు సీక్రెట్ పాకెట్ లో ఉండే సిగరెట్ పెట్టి ఎప్పుడూ గుర్తు చేస్తూనే ఉంటుంది. అయినా ఇన్నాళ్ళూ నిగ్రహించుకు వచ్చానా లేదా?

కొత్తగా వచ్చిన కుర్ర స్టెనోతో ఆరోజు కబుర్లలో కాలం దొర్లిపోయి ఇంటి కొచ్చాక గాని గుర్తు రాలేదు, అనూని ఆవేళ సినిమాకి తీసికెళతానని మాట ఇచ్చానని. పిల్లల్ని తీసుకుని అప్పుడే ఆవిడ రిక్షా ఎక్కి పావుగంట దాటెందంటూ పక్కింటి వాళ్లు తాళాలు ఇచ్చారు.


గిల్టీగా ఫీలయినప్పుడు బుర్ర పల్టీలు కొట్టకుండా 'మరుకు' దనం కలిగించే పనిముట్టు సిగరెట్టు. అలా ఊదేస్తూ ఊహాలోకాల్లో ఈదేస్తూ ఎంత సేపు గడిపానో నాకే తెలీదు. అనూ గావుకేకల్లో ఈ లోకంలోకి వచ్చి చుట్టూ పరికించాను. టిక్కెట్లు దొరక్క పిల్లల్తో ఏ సందున ఇంట్లో దూరిందో మరి, నలుగుర్నీ కేకేసుకు వచ్చి మరీ మీటింగు పెట్టినట్టుంది.


'చూశారా! చూశారా! ముగ్గులు పెట్టిన తులశమ్మ ముంగిట్లో శుక్రవారం పూటా కాండ్రించి ఉమ్ములూ, కాల్చి పారేసిన సిగరెట్టు పీకలూ! పవిత్రమైన మునీశ్వరుల యాగవాటికల్ని రక్తమాంసాలు పోసి రాక్షసులు ధ్వంసం చేశారంటారు చూశారా, ఇదిగో ఇలాగ.......,

నలుగురి మధ్య తల తీసేసినట్టు చేసి పారేస్తే మాటాడక ఊరుకుంటే నా మగతనం ఏం కాను! తిప్పి కొట్టే అవకాశం అతి త్వరలోనే చేజిక్కింది.

అనూరాధకి ఎడం చేతి చూపుడు వేలూ, మధ్య వేలూ జోడించి నోట్లో పెట్టుకుని పీల్చే అలవాటు పెద్దయ్యేదాకా ఉందని విన్నాను. పెళ్లయాక కూడా అప్పుడప్పుడూ అతీంద్రియావస్థలో మునిగి తేలుతూ ఉంటుందని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. ఏదో ఫైలు మరచిపోయి నేనోనాడు ఇంటి కొచ్చేసరికి ఇదీ దృశ్యం! వెంటనే కెమేరా క్లిక్ మనిపించే దాకా ఉండలేకపోయాను. ఆ ఫోటో నాలుగు కాపీలూ 'నిర్మల గంగ నిజస్వరూపం' అనే కేప్షన్ తో సహా ఆ చుట్టు పట్ల నలుగురికీ అందజేస్తేగాని నా పగ చల్లారింది కాదు, ఏం చెయ్యమన్నారు!

అవును, ఏం చెయ్యమన్నారు.. విడివిడిగా మేం చెడ్డవాళ్లం కాదు. కలివిడిగానే మాలో ఏ కలహం పుట్టినా. ఒకప్పుడు ఏకాంతంగా ఉన్నప్పుడే ఎత్తిపోతలు. ఈ మధ్య పక్కనిగుంట జంట ఉన్నా పరుషాలు ఆపలేని పౌరుషాలకు పాల్పడుతున్నాం. మరీ ఇటీవల కాలంలో ఏ రైల్వే ప్లాట్ ఫాం మీదయినా సరే జుత్తు జుత్తూ పట్టుకోడానికి మేమిప్పుడు సిద్ధం. పోనీ యీ మాత్రపు స్వారస్యంతోనైనా మా సంసారం సాగి చావకూడదా? ఏదో సుఖపడి అఘో






రిస్తున్నట్టు మా అత్తగారు దిగబడింది. అదే, మా అక్కయ్య రేవతి!

ఉన్న ఒక్క కూతురి దగ్గరకే నిలుచున్న పాళంగా దిగిపోడానిక ఆవిడకి అభ్యంతరం ఏం లేదుగాని ఆ కూడా వచ్చిన సామాను చూస్తే నాకు కళ్లు తిరిగేయి. ఇలా దిగిపోయిందేమిటా అనిపించింది. రెణ్ణెల్ల కిందటేగా బావ రిటైరయిందీ, ఏకంగా యిక్కడికి వచ్చేస్తారనే అనుకున్నాం. అక్కడ మీ యిల్లు అమ్మకం పెట్టేరా? అన్నీ అయి పోయాక ఏకంగా ఇద్దరూ లారీతో వచ్చేస్తే బావుణ్ణు కదా! నువ్వు వచ్చేస్తే ఈ వయసులో ఆ ఒంటరి మనిషికి ఇబ్బందేమో!, అనే నా మాట యింకా నోట దాటనేలేదు, అక్కయ్య చుర చుర చూసింది. 'ఏ వయసులో అయినా మీ బావ ఇబ్బందికీ, నేనింటి పట్టున ఉండడానికీ ఎటువంటి సంబంధమూ లేదులే, నువ్వేట్టే కంగారు పడనక్కర్లేదు!' అంటూ ఓ విషపు నవ్వు నవ్వి విసురుగా లోపలికి వెళ్లిపోయింది. ఈవిడ కూతురు మాట మామూలుగా ఉండదు, ఏదో అరచినట్టు ఉంటుంది! ఇక ఆ తల్లిగారి పలుకు కిటుకు ఇప్పటికి నాకు తెలిసింది. ఎక్కడో చరిచినట్టు ఉంటుంది, ఎవరో కరిచినట్టు ఉంటుంది!

చూడ్డానికయితే ఆ కూతురు తల్లిలా ఉండదు. అక్కలా ఉంటుంది. శరీర సౌష్టవం మాట అలా ఉంచి మరి ఏ ఎప్పుడు ఏ సందున ఇంత హెయిర్ డై పూస్తుందో ఒక్క తల వెంట్రుక పండ నివ్వదు. ఈ వయసులో రోజుకి ఎన్ని సెట్లు మారుస్తుందో కట్టుకున్న బట్ట నలగనివ్వదు. ఇంతటి నీట్‌నెస్ చూసి ఇదంతా మోడ్రన్ అవుట్ లుక్ అనుకుంటే ఇంతకన్న తప్పు అంచనా ఉండదు!

ఈ ఆడవాళ్ళిద్దరూ ఎవరికివారే ఒక్క చూపుడు వేలు మీద ఈ భూచక్రాన్నంతా తిప్పగల సమర్థులమనే సంపూర్ణ విశ్వాసంతో ఉన్న వారు. ఇక వీరిద్దరూ ఒక చోట చేరితే నాలాంటి మామూలు శాల్తీలు ఆ శక్తిద్వయానికి ఆనుతారా! ఆ ధాటికీ ఘాటుకీ తట్టుకోలేక నెల్లాళ్ల దాటకుండానే మా బావదగ్గిరికి పరిగెత్తాను. అదొక్కటే కాదు. నారాయణ బావ ఎవర్తినో చేరదీసి పల్లిగ్గా కాపరం వెలిగిస్తున్నాడనే స్కాండల్ అక్కయ్య నోటనే కాదు, ఎందరో చెప్పగా విన్నాను. ఈ వయసులో ఇదేం పోగాలం! అని నిలదీసే అధికారం ఇంకా నాకుంది గనక హడావిడిగా బస్సెక్కేశాను. తీరా ఆ ఒక్క రోజూ వాళ్లతో గడిపాక నా మతి పోయినట్టయింది.

నారాయణ బావ కొత్తగా పెట్టిన ఎంసెట్ కోచింగ్ సెంటరుకి పార్వతమ్మ ప్రిన్స్‌పాలట. భర్తా పిల్లలూ యాక్సిడెంటులో పోతే పుట్టిల్లయిన ఆ ఊరు చేరిందిట. ఏడాదయాక కాస్త తేరుకుని బావ ఆధ్వర్యంలో మిగిలిపోయిన ఎమ్మే పేపర్లు కట్టి కిందటేడే డిగ్రీ తెచ్చుకుందిట.

లోకంలోని చిత్రాలన్నిటిలోకీ చిత్రమైంది ఏమిటంటే అప్పటి వాళ్ళిద్దరి అనుబంధమూ అనిపించింది నాకా క్షణాన. ఒకే కడుపున పుట్టిన అక్కయ్య యింట్లో అడుగు పెట్టినప్పుడు ఎంతో బెరుకుగా దిగులుగా ఎప్పుడు పోదామా అన్నట్టు ఉండేది నా ప్రాణానికి. ఎంత తెలిసిన వాడినయినా అతిథిని కదా, ఆ ఒక్కరోజైనా కొంప నిశ్శబ్దంగా ఉంచడానికి మా బావ నోచుకుని ఉండడ్దూ! మామూలు కంటె పై స్థాయిలోనే కొంప ఎగిరిపోయేది.

సీరియస్ తెప్పు తగవులన్నిటికీ కారణాలు సీరియస్‌గా ఉండాలని లేదు, సిల్లీగా ఉంటాయి కూడా.

బూరెల మూకుడు కాస్త పై వైపు మసి ఉండిపోయిందనీ, దాంతో ఆనాటి మడి ఆమూలాగ్రం తగలడినట్టేనీ, తద్వారా తలపెట్టిన సమస్త పూజావిధానమూ సర్వనాశనమై మన్వంతరాలన్నీ మంట కలసిపోయినట్టేననీ పనిమనిషి అప్పలమ్మ మీద అక్కయ్య రేవతి గావుకేకలు.

ఆ కేకల ధాటికి జడిసి అప్పుడే నిద్రకి ఉపక్రమిస్తున్న అతిథి తమ్ముడు హడలిపోయి మంచం మీంచి కింద పడినా ఆవిడ ఊరుకోదు. అవమాన భారంతో గుండె దెబ్బతిని యింటాయనకి వల్సి అందకపోయినా ఆవిడ లక్ష్యపెట్టదు. కంటికి కనిపించే తమ్ముడూ కట్టుకున్న మొగుడూ, ఇలాంటి శాల్తీలు ఆవిడ దృష్టిలో ఎలా పోయినా బాధ లేదు. ఎక్కడ ఏమాత్రము దోషలేశమయినా అంటకుండా పరమ పవిత్ర స్థాయిలో నోములూ వ్రతాలూ పూజలూ పుణ్యావహాచనాలూ నిర్వహించబడి గోత్రాలు ఆచంద్రార్కమూ గౌరవింప బడేవి. ఋషులు శాంతించాలి, దేవాలు దీవించాలి, మనుషులు ఎలా తగలడితేనేం!

ఇంతకీ ఎవరి ఆరగింపుకి ఏ ప్రసాదం చేయించాలని చూసినా ఆ పని జరిగేది ఆ మూకుడు లోపలి వైపున గాని అవతలి వైపున కాదు. ఇటువైపు పరిశుభ్రంగా తళతళ లాడుతున్నంత కాలం అటువైపు నుంచి వచ్చి అంటుకుని కులభ్రంశం చేసే కల్మషం ఏమిటో రీజనింగుకి మాత్రం అందదు!

తల్లి చేసిన ఈ మూకుడు తోముడు ఆర్భాటం గుర్తుకు తెచ్చుకున్నపుడల్లా మొదట్లో వాళ్లమ్మాయి చేసిన 'ఒకే నూతిలో రెండు రకాల నీళ్ల ఉదంతం' కూడా నన్ను వెంబడిస్తూ ఉంటుంది.

మేం మొట్టమొదల్లో కాపురం ఉన్న

యింటి పెరట్లో ఓ నుయ్యి ఉండేది. సిమెంటు చప్టా, మంచి గిలక కూడా ఉండేవి. బాల్చీ తాడూ మాత్రం మా వి. దాసీ మనిషి రాగానే బాల్చీ తాడూ ఇచ్చేది మా అనూరాధ. నీళ్లు తోడి, అంట్లు తోమి, వాడుక నీళ్లు బాల్చీలలో నింపి దాసీ మనిషి దూరంగా వెళ్లిపోయేది. కాస్సేపటికి అనూ వచ్చేది. అంతకు ముందు రోజు ఉంచుకున్న నీళ్లతో చప్టా కడుక్కునేది. బాల్చీ సబ్బుగుండతో తోముకుని తాడు మీద పసుపు నీళ్లు జల్లుకునేది. గిలక మీద కూడా మడి నీళ్లు ప్రోక్షించేది. నీళ్లకి కులం లేదని అనుకునేరు ఒకే నూతిలోంచి అవుతే తొగాక దాసీది తోడినవి వాడకానికి, వాటి పేరు కాపనీళ్లు! అమ్మగారు తోడినవి తాగడానికి, వాటి పేరు బ్రాహ్మణ నీళ్లు!

నా మనసు వర్తమానానికి మళ్లిస్తూ పార్వతిని పరిచయం చేస్తూ బావ 'ఇడుగో ప్రిన్సిపాలు అయిన నాటినుంచీ యీవిడే నా బ్రెడ్ విన్నర్' అంటూ నాకే వినపడేలా 'మరీ ఈ మధ్య బెడ్ విన్నర్ కూడా' అని పూర్తి చేశాడు. ఆ ఆఖరివాక్యం నా గుండెల్లో అలా దిగబడిపోయింది. ప్రియారిటీస్ ఏమిటో తెలుసుకోకుండా ప్రగతి అంటే అర్థం చేసుకోకుండా మూఢత్వం తోనే ముక్తి అనుకునే మా అక్కయ్య కాపరంలో మా బావ మొహం ఒక్కసారంటే ఒక్కసారైనా ఇంతగా వెలిగిపోలేదు.

పింఛను పుచ్చుకున్నాకైనా పింఛెం విప్పి ఆడింది ఆ మనసు, అదెంత కాదు! అలా దోహదం చేసిన ఆ మనిషిదెంత గొప్పమనసు!

నారాయణ బావ జీవితంలోని చివరి మలుపు నాకు చెప్పకుండానే గొప్ప సందేశం అందజేసింది. ఏ పాతికేళ్లు మా అక్కయ్యతో పడ్డాడో మహానుభావుడు, పద్మశ్రీ యివ్వొచ్చు. అయిదేళ్ళకే నాదారి నాకు చూపించిన వాళ్లమ్మాయి బృహన్నకకి జోహర్లు. ఇద్దరూ ఓ చోట చేరారు గనక ఒకరు జీవాత్మా మరొకరు పరమాత్మా అనుకుని కలిసిపోయి కాలక్షేపం చెయ్యగలం చరితార్థులు. ఉప్పు, పులుసూ తిని సారమూ స్పందనా ఆశించే నాలాంటి జీవికి ఇంకో దారి తప్పదు. రుక్మిణిని లేవదీసుకు పోయిన శ్రీకృష్ణుడే సుభద్రని ఏ వేషం వేసి ఎలా లాంగదీసుకోవాలో అర్జునుడి లాంటి నరులకు సూచించగలడు. ఏమైనా ఇక ఆలశ్యం చేసి నేను సాధించుకునేది ఏమీ లేదు. మన యింట్లోకి వెన్నెల రాదు. మనమే వీధిలోకి పరిగెత్తి వెన్నెలలో విహరించడం నేర్చుకోవాలి.

# కావ్యస్పర్శ

ఎన్నాళ్ళుగానో
వ్యప్నించటం మర్చిపోయిన నా కళ్ళకు
ఎన్నేళ్ళుగానో
తెరువని నా యద వాకిళ్ళకు
ఒక సుందర దృశ్య కావ్యం
స్వాప్నవిస్తూ ఎదురొచ్చింది-
నాలో ఒక కొత్త కీర్తనను పలికించింది-

అలవోకగా సాగిపోయే నీలి మేఘం
గాఢంగా ఆకొండలని స్పృశించాయేమో
తమ విలువెల్లా నీలినీలి నవ్వులతో
కలరాడిపోతున్నాయి.

గాలి వూంకారు వల్లకిపై
పరిమళాల్ని తేలతేల సాగనీ మోసుకొస్తూ
అడవి పిట్టల సమూహంలో
ఒక అందమైన పాటను విరిసింది-
క్షణంలో లోయంతా ఒకే స్వర రాగమాల!
వేం తుళ్ళింతం యౌవనం!
తీయాలి కోలంకి విల్లిన లేవుల తనువులపై
విరు రెమ్మల షోకుం పోకడ!
అడవంతా ఆకుపచ్చ సౌందర్యాల వెల్వెట్ తివాసీలా
వాటిపై కెంపులీను కోశరత్నాలూ
సీతాకోక చిలుకల్ని ఆకర్షించుకుంటున్న
చిన్ని గరిక పూలూ, సుకుమార పారిజాతాలూ

భిన్న భిన్న సౌందర్యాల ఏకత్వం
ప్రకృతి ప్రసాదించిన జ్ఞాననేత్రంలావుంది
పల్చటి మంచుదుప్పటి ముసుగులో
గారాలు పోతున్న సోయగాల్ని
ఆవిష్కరించేందుకు ప్రాచీరేఖ పైగా
వస్తున్నాడొక పెద్ద
తన సహస్ర వెలుగు చేతులతో
మెత్తగా పాదువుకుంటూ
ఆత్మీయంగా యదయదనీ హత్తుకుంటూ-
ఆవెచ్చని వెలుగుల ఉదయం
విచ్చుకున్న భావాల మాలా తోరణం!
అక్కడ ... ఐక్యతే వెల్లివిరిసిన శాంతిసందేశం
అప్పుడే పుట్టిన పసిపాప నిర్మలత్వం
నాలో కరిగించి పోసిన అనుభూతుల్లోంచి
ఆ సుందర చిత్రాల జాడల్లోంచి
ప్రాచీన ఋషుల ఆత్మోన్నతత్వంనించి
నడుచుకుంటూ వస్తున్నాడో కొత్త మానవుడు.
ఈధరాతలంలో శాంతిని పండించగల కృషీవలుడు
రేపటి వెలుగుల్ని అందరికీ పంచగల దీక్షాధరుడు!

* * *